పెద్దాసుపత్రిలో పార్కింగ్ అస్తవ్యస్తం

- ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలుపుతున్న వైనం
- పార్కింగ్ పాయింట్లు లేక ఇబ్బందులు



ఆస్పత్రి ఓపీ విభాగం వద్ద నో పార్కింగ్ జోన్‌లో పెద్ద సంఖ్యలో నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వాహనాల పార్కింగ్ సమస్య వేధిస్తోంది. రోజూ ఓపీ సమయంలో వందల సంఖ్యలో వస్తున్న వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలిపి ఉంచుతున్నారు. దీంతో మనుషులు నడిచేందుకు, అంబులెన్స్‌ల రాకపోకలకు సైతం ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆసుపత్రికి కర్నూలు జిల్లా నుంచే గాక నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్, రాయచోటి, ప్రకాశం, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి రోగులు చికిత్స నిమిత్తం వస్తుంటారు. ఈ మేరకు ప్రతిరోజూ ఓపీ రోగుల సంఖ్య 2,500 నుంచి 3 వేల వరకు ఉంటోంది. ఇన్‌పేషంట్లు 1200 నుంచి 1500 వరకు ఉంటున్నారు. వీరికి వైద్యం అందించే వైద్యులు, చికిత్స చేసే స్టాఫ్ నర్సులు, పారామెడికల్ సిబ్బంది, నాల్గవ తరగతి ఉద్యోగులు, సెక్యూరిటీ, శానిటేషన్, పెస్ట్‌కంట్రోల్ సిబ్బంది, వైద్య విద్యార్థులు, హౌస్‌సర్జన్లు, పీజీలు, ప్రైవేటు నర్సింగ్ కాలేజీలు, స్కూళ్ల విద్యార్థులు, రోగులు, వారి సహాయకులు కలిపి నిత్యం 10 వేల నుంచి 15 వేల మంది దాకా ఆసుపత్రిలో తిరుగుతూ ఉంటారు. ఇందులో సగం మందికి పైగా వాహనాలు ఉన్నాయి. వైద్యుల కార్లు, వైద్య విద్యార్థులు, స్టాఫ్‌నర్సులు, ఉద్యోగులు, ఇతర సిబ్బందికి సంబంధించిన బైక్‌లతో పాటు రోగులు, వారి సహాయకులు సైతం బైక్‌లు వేసుకుని ఆసుపత్రిలోని ఆయా విభాగాల వద్ద పార్కింగ్ చేసి వెళ్తున్నారు. దీనికితోడు రోగులను ఆసుపత్రికి తీసుకొచ్చే అంబులెన్స్‌లు, జీపులు, కార్లు, ఆటోలు నిత్యం ఇక్కడ తిరుగుతుంటాయి. ఆసుపత్రిలో ప్రత్యేకంగా పార్కింగ్ స్థలం లేకపోవడంతో ఏ విభాగం వద్ద పని ఉంటే అక్కడ వాహనాలు పార్కింగ్ చేసి వెళ్తున్నారు. ఈ కారణంగా ఆసుపత్రిలో ఎక్కడ చూసినా వాహనాల పార్కింగ్‌తో కిక్కిరిసిపోతోంది. దీనికి తోడు ఇటీవల ఆసుపత్రిలో నూతన భవనాల నిర్మాణం కారణంగా ఖాళీ స్థలాలు లేకపోవడం, ఉన్న భవనాలు కూల్చివేసి నూతన భవనాలు నిర్మిస్తుండటంతో పార్కింగ్ సమస్య ఎక్కువైంది. ఈ కారణంగా వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేయించాలన్నా అధికారులకు సమస్యగా మారింది. గతంలో పార్కింగ్‌కు టెండర్ వేసి ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టినా వారు నిర్వహించలేక చేతులెత్తేసి మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయారు. అప్పటి నుంచి టెండర్ జోలికి వెళ్లడం లేదు. ఆసుపత్రిలోని సెక్యూరిటీ సిబ్బందే వాహనాల పార్కింగ్‌ను పర్యవేక్షిస్తున్నారు. గత కొన్ని నెలలుగా సెక్యూరిటీ సిబ్బందికి జీతాలు రాకపోవడంతో వారు సైతం పార్కింగ్ వాహనాలపై దృష్టి సారించడం లేదు. దీంతో ఆసుపత్రిలోని ఓపీ విభాగం, డయాగ్నోస్టిక్ బ్లాక్, బాలాజీ క్యాంటీన్, మెడికల్ వార్డులు, సర్జరీ వార్డులు, గైనిక్, చిన్నపిల్లల విభాగం, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, సూపర్‌స్పెషాలిటీ విభాగాలు, శుశ్రుతభవన్ వద్ద వాహనాల పార్కింగ్‌తో కిక్కిరిపోయి ఉంటోంది. వాహనాల పార్కింగ్ విషయమై ఏ ఒక్కరిని ప్రశ్నించినా అత్యవసర వైద్యం కోసం వచ్చిన మమ్మల్నే ఆపుతావా అంటూ సెక్యూరిటీ సిబ్బందిపై దాడికి వెళ్తున్నారు. దీనికి తోడు తాము ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, ఉద్యోగులమంటూ మరికొందరు దబాయిస్తుండటంతో సెక్యూరిటీ సిబ్బంది సైతం ట్రాఫిక్ సమస్యలపై చేతులెత్తేశారు. ఈ విషయమై అధికారులు పునరాలోచించి సమస్యకు పరిష్కారం చూపాలని రోగులు, వారి సహాయకులు కోరుతున్నారు.

పార్కింగ్ పాయింట్లు పెట్టాలి



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ప్రతిరోజూ వేలాది మంది రోగులు, వారి సహాయకులు చికిత్స కోసం వస్తుంటారు. ఇలా వచ్చిన వారిలో సగానికి పైగా ప్రజలకు సొంత వాహనాలు ఉంటాయి. ప్రస్తుతం ఆసుపత్రిలో నూతన భవనాలు నిర్మిస్తున్నందున ఖాళీ స్థలాలు తక్కువయ్యాయి. ఈ కారణంగా వాహనాలు ఎక్కడ పార్కింగ్ చేయాలో అర్థం కాని పరిస్థితి. ఎక్కడ పెట్టినా సెక్యూరిటీ వారు అభ్యంతరం చెబుతున్నారు. కొన్ని నిర్దిష్ట పార్కింగ్ పాయింట్లు పెడితే రోగులకు సౌలభ్యంగా ఉంటుంది.

– కె.బలరాం, ప్రజాపరిరక్షణ సమితి అధ్యక్షులు, కర్నూలు

నెల రోజుల్లోగా సమస్యకు పరిష్కారం



ఆసుపత్రిలో పార్కింగ్ సమస్య కొంతకాలంగా ఇబ్బందిగా మారింది. నూతన భవనాలు నిర్మిస్తుండడం, పాత భవనాలు కూల్చివేయడం వల్ల ఖాళీ స్థలాల సమస్య ఏర్పడింది. ఈ కారణంగా ఉన్న కొద్దిపాటి స్థలంలో వాహనాలు పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికితోడు ఆసుపత్రిలో రోగులే గాక బయటి వారు సైతం వాహనాలు పార్కింగ్ చేసి వెళ్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేయకుండా నియంత్రించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం. నెల రోజుల్లోపు పార్కింగ్ సమస్యకు పరిష్కారం చూపిస్తాం.

– డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

క్లుప్తంగా

రజక కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి



రజక యువతతో సమావేశమైన సి.గురుశేఖర్

కర్నూలు(సెంట్రల్): రజక కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి యువతకు ఉపాధి కల్పించాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం చాకలి ఐలమ్మ కార్యాలయంలో ఆయన రజక యువతతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఓ నంబర్ 27 ప్రకారం ప్రభుత్వ శాఖల్లో ఉన్న దోబీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్పొరేషన్ ద్వారా చిన్న, చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి నిధులు కేటాయించాలన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర పాల్గొన్నారు.

బ్రాహ్మణ కమిటీలోకి నూతన సభ్యులు



సమావేశమైన బ్రాహ్మణ సంఘం నాయకులు

కర్నూలు న్యూసిటీ: నగరంలోని సంకల్‌బాగ్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం బ్రాహ్మణ సంఘం నాయకులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆ సంఘం నగర అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. బ్రాహ్మణ సంఘం కమిటీలోకి ఐదుగురు ఉపాధ్యక్షులు, ఒక సంయుక్త కార్యదర్శిని తీసుకున్నట్లు తెలిపారు. బ్రాహ్మణులకు ఇంటి స్థలాలు, టిడ్కో ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌కు కొత్త చైర్మన్‌ను ఏర్పాటు చేసి, రూ.270.61 కోట్లు కేటాయించినందుకు హర్షం వ్యక్తం చేశారు.

ఉషా పోటీలు ప్రారంభం

కర్నూలు (టౌన్): నగరంలోని కిడ్స్ వరల్డ్ కమ్యూనిటీ హాలులో ఆదివారం 7వ జిల్లా స్థాయి ఉషా పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లా ఉషా సంఘం కార్యదర్శి టీ.శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో అండర్–12, అండర్–15, అండర్–18 విభాగాల్లో బాల బాలికలకు ఉషా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

దిగువపాడులో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



దిగువపాడులో ప్రచారం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని దిగువపాడు గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక చింతలపల్లి కమిటీ సభ్యులు ప్రచారం నిర్వహించారు. ప్రబోధానందయోగీశ్వరులు రచించిన గ్రంథం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సభ్యులు పుల్లారెడ్డి, కూమారచారి, నాగ మద్దిలేటి, సంజీవ, గిరిబాబు, రాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యం



పత్తికొండలో వధూవరులతో ఎస్వీ మోహన్‌రెడ్డి

పత్తికొండ(తుగ్గలి) : పత్తికొండ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు జిల్లా సోమశేఖర్, నాగమణి దంపతుల కుమారుడు మధుసూదన్ నాయుడు వివాహం పట్టణానికి చెందిన ప్రీతితో ఆదివారం ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, కేడీసీసీ మాజీ వైస్ చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆలూరు రూరల్: కారు, స్కూటర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఆదివారం మధ్యాహ్నం ఆలూరు సమీపంలోని 133 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ప్రమాదం జరిగింది. వివరాలు.. మండలంలోని కురువళ్లి గ్రామానికి చెందిన శేకన్న, మంజు స్కూటర్‌పై ఆలూరు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ సమయంలో ఆలూరు వైపు నుంచి బళ్లారికి వెళ్తున్న కారు స్కూటర్‌ను వెనుక నుంచి ఢీకొట్టి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో శేకన్న తలకు తీవ్రగాయాలు కాగా మంజు ఎడమకాలు,వీపుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం బళ్లారి ఆస్పత్రికి రెఫర్ చేశారు. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు, ముగ్గురు పిల్లలు సురక్షితంగా బయటపడ్డారు.

నేడు నగరపాలకలో అర్జీల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు తమ కాలనీలలో నెలకొన్న సమస్యలపై అర్జీలు అందజేయవచ్చన్నారు. ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో అర్జీదారులు దరఖాస్తుతో పాటు అధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్‌తో హాజరు కావాలని సూచించారు.

తైక్వాండో శిక్షణ శిబిరం ప్రారంభం

కర్నూలు (టౌన్): విద్యార్థి దశలో తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ క్రీడలు అవసరమని న్యాయవాది శ్రీధర్ రెడ్డి అన్నారు. ఆదివారం కొండారెడ్డి బురుజు సమీపంలోని కేఎంసీ పార్కులో ఉచిత తైక్వాండో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన ఆయన క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆత్మరక్షణ కోసం బాలికలు మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడల్లో రాణించాలన్నారు. ఒలింపిక్ క్రీడగా గుర్తింపు ఉన్న తైక్వాండో క్రీడలో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఉదయం, సాయంత్రం తైక్వాండోలో ఉచిత శిక్షణ అందిస్తున్నామన్నారు. చిన్నారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

వార్డెన్లపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): సంక్షేమ హాస్టళ్లకు సమయానికి విధులకు హాజరుకాని వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మహిళా విభాగం డిమాండ్ చేసింది. ఆదివారం ఎస్ఎఫ్ఐ మహిళా విభాగం కలెక్టరేట్ సమీపంలోని బాలికల హాస్టళ్లను సందర్శించింది. ఆ సమయంలో వార్డెన్లు లేకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మానవాళికి మార్గదర్శి భగవద్గీత



విజేతలను సన్మానిస్తున్న డాక్టర్ ఐ.శ్రీదేవి తదితరులు

కర్నూలు(సెంట్రల్): మానవాళి జీవన విధానానికి మార్గదర్శి భగవద్గీత అని, జీవితంలోఎదురయ్యే ఒడిదుడుకలను ఎలా అధిగమించాలో భగవద్గీతలో సంపూర్ణంగా పొందుపరచారని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీదేవి పేర్కొన్నారు. ఆదివారం టీజీవీ కళాక్షేత్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్యం నుంచే భగవద్గీత పఠనంపై ఆసక్తి పెంచుకుంటే భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలనైనా ఎదుర్కోగలరని పేర్కొన్నారు.

విజేతలు వీరే..

భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీల్లో 6–7 తరగతుల విభాగంలో విజేతగా జే.కృష్ణ, ద్వితీయస్థానంలో పవన్‌కుమార్, తృతీయస్థానంలో పి.వీక్షశ్రీ, 8–9 తరగతుల విభాగంలో విజేత భువనశ్రీ, ద్వితీయ స్థానంలో శ్రీనిధి, తృతీయ స్థానంలో శ్రీనిత్య నిలిచారు. అలాగే 18 సంవత్సరాల పైబడిన వారి విభాగంలో విజేత ఎం.సంగీత, ద్వితీయ స్థానంలో బి.అపర్ణ, తృతీయ స్థానంలో జి.శివన్న, 18 సంవత్సరాల్లోపు విభాగంలో విజేత బి.నాగశర్వాణి, ద్వితీయ స్థానంలో సి.తరుణి నిలిచారు. విజేతలకు రూ.1000, ద్వితీయ స్థానం వారికి రూ.750, తృతీయస్థానం వారికి రూ.500 నగదుతోపాటు ప్రశంసా పత్రాన్ని అందించారు. విద్యార్థులందరికీ శ్రీమద్రాయణ సంగ్రహం గ్రంథాలను అందజేశారు. పోటీలకు హాజరైన వారికి తరిగొండ వెంగమాంబ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పసుపులేటి నీలిమ ఆధ్వర్యంలో మహాప్రసాదం అందించారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, అధ్యాపకులు వరలక్ష్మి, గరుడాద్రి వనజకుమారి, ఎ.శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుష్ప్రచారం మానుకోవాలి



మాట్లాడుతున్న శ్రీ షిర్డీసాయి ధర్మ పరిరక్షణ సేవా సమితి సభ్యులు

కర్నూలు(సెంట్రల్): సర్వమత, సామరస్యం, సమత భావన, ప్రేమ, సేవ భావాలతో మానవులను ఐకమత్యం చేసేందుకు అవతారం ఎత్తిన శ్రీషిర్డీ సాయిబాబాపై దుష్ప్రచారం చేయడం మానుకోవాలన ఏపీ శ్రీషిర్డీ సాయి ధర్మ పరిరక్షణ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు జి.శ్రీనివాస్, జి.హరిహరరావు హితవు పలికారు. కొందరు సమాజంలో చీలికలు తెచ్చేందుకు కావాలనే సాయిబాబాపై అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఆదివారం శంకరమఠంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇటీవల సాయిబాబాపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. సాయిబాబా తన మహిమలు, సంఘ సంస్కరణ ద్వారా ప్రజల గుండెల్లో దేవుడిగా కొలువు దీరారన్నారు. కాశీలో సాయిబాబా విగ్రహాలను తొలగించడం, గ్రంథాలను మార్పు చేసే ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సాయిబాబాపై అనుచిత వ్యాఖ్యలుచేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కోరుతున్నామన్నారు. ఉపాధ్యక్షుడు కర్లపూడి కృష్ణ, మధుసాయి, కోశాధికారి రబీన కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దస్తగిరిస్వామి ఉరుసు



గంధంను ఊరేగింపుగా తీసుకెళుతున్న దృశ్యం



వెలసిన రంగుల రాట్నం, ఆట వస్తువులు

తుగ్గలి: మండలంలోని జొన్నగిరిలో దస్తగిరిస్వామి దర్గా ఉరుసు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున తిమ్మనచెర్ల విజయభాస్కరరెడ్డి ఇంటి నుంచి మేళతాళాలతో గంధం ఊరేగింపుగా దర్గాకు తీసుకెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కుల మతాల కతీతంగా భక్తులు దర్గాను సందర్శించి చెక్కెర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉరుసు సందర్భంగా బంధుమిత్రుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది. మిఠాయి, ఆటబొమ్మలు, గాజుల అంగళ్లు, రంగుల రాట్నం, జెయింట్ వీల్, జంపింగ్ స్లైడ్ వంటివి వెలిశాయి. సోమవారం వేకువజామున స్వామి ప్రతిమను ఊరేగిస్తామని ముజావర్లు తెలిపారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం మాళమల్లేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. సుప్రభాత సేవ, జలాభిషేకం, కుంకుమార్చన, భండారార్చన, పుష్పార్చన, మహామంగళారతి, ఆకుపూజ, నైవేద్యం సంతర్పణ పూజలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు స్థానిక ఆస్పరి మఠంలో అన్నదానం చేశారు.

అపార్ సమస్యలు పరిష్కరించాలి

ఆదోని సెంట్రల్: అపార్ ఐడీ నమోదులో సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ సీనియర్ నాయకులు బి.సత్యన్న డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్టీయూ భవనంలో సంఘం మండల అధ్యక్షుడు సి.రామకృష్ణ అధ్యక్షతన ఆదోని, కౌతాళం మండల నాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ విద్యార్థుల అధార్‌లో ఇబ్బందులను తొలగించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, పాఠశాలల్లోనే మొబైల్ ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్టీయూ అకాడమిక్ కమిటి సభ్యులు మహదేవప్ప మాట్లాడుతూ ఎస్జీటీ సీనియర్ ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలన్నారు. పదోన్నతి ద్వారా ప్రాథమిక పాఠశాల హెచ్ఎంలను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు గోపాల్, రామాంజినేయులు, సుధాకర్, షేక్షావలి, అంజినయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ కమిటీ ఎన్నిక

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని గీతాముఖర్జీ నగర్ ఏఐవైఎఫ్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా రఫీక్, శ్రీకాంత్‌లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి, నగర కార్యదర్శి బీసన్న, మహిళా సమైక్య నాయకురాలు సోఫియా, ఆశాబేగం పాల్గొన్నారు.

ప్రజల కోసమే సీపీఐ పోరాటం

కర్నూలు(సెంట్రల్): నిత్యం ప్రజా పోరాటాలు చేస్తున్న సీపీఐ పార్టీకి బాసటగా విరాళాలు ఇవ్వాలని ఆ పార్టీ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి కోరారు. ఆదివారం ఇందిరమ్మ బిల్డింగులు, కాదంబరీ రియల్ ఎస్టేట్, టీవీ 9 కాలనీల్లో సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటి విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూరు సంవత్సరాలుగా సీపీఐ బడుగు, బలహీన వర్గాల కోసం పనిచేస్తోందన్నారు. ప్రజల నుంచి విరాళాలు సేకరించి ప్రజల కష్టాలను తీర్చేందుకు పోరాటాలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కరీమున్నీసా, సి.మహేష్,సోమన్న అమినాబీ, రాముడు, పద్మ పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాలను మున్సిపల్ వాహనాల వారికి ఇవ్వాలి

కర్నూలు (టౌన్): నగర పరిధిలోని చికెన్, మాంసం దుకాణాదారులు వ్యర్థాలను నగరపాలక వాహనాల వారికి అప్పగించాలని ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి ఆదివారం ఒక ప్రకటన ద్వారా సూచించారు. మాంసం వ్యర్థాల నిర్వహణ కోసం టెండర్ వేసేంతవరకు తప్పనిసరిగా మున్సిపల్ వాహనాల వారికి అందించాలన్నారు. ఇందుకు విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులకు ఇస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హెచ్చరికలు బేఖాతరు చేస్తే షాపు ట్రేడ్ లైసెన్సు రద్దు చేయడంతో పాటు సీజ్ చేస్తామని వెల్లడించారు. చికెన్, మాంసం దుకాణ యజమానులు సహకరించాలని కోరారు.

19 మంది మందుబాబులపై కేసు

కర్నూలు (టౌన్): బహిరంగంగా మద్యం సేవిస్తున్న 19 మందిపై పోలీసులు ఆదివారం కేసులు నమోదు చేశారు. స్థానిక నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని శరీన్‌నగర్, వక్కెర వాగు, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం తాగుతున్న వారిని డ్రోన్ కెమెరాల ద్వారా గుర్తించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ మాట్లాడుతూ.. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతరం నిఘా పెడతామని చెప్పారు. కర్నూలు నాలుగవ పట్టణ ఎస్ఐ గోపీనాథ్, ట్రాఫిక్ ఎస్ఐ హుస్సేన్ పాల్గొన్నారు.

కంకర పరిచారు.. రోడ్డు మరిచారు!



పందిపాడులో కంకర పరిచిన రోడ్ల దృశ్యాలు



- నాలుగు నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న కాలనీల వాసులు
- పట్టించుకోని అధికారులు

కల్లూరు: కల్లూరు అర్బన్ 28వ వార్డు పరిధిలోని పందిపాడు గ్రామం కాలనీ వాసులు ఓ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మూలంగా ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఆ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా కాలనీ వాసులకు శాపంగా మారింది. గ్రామానికి సంబంధించి రెండు రోడ్లు వేయాలని కొన్ని నెలల క్రితం కంకర పరిచారు. దీంతో ఆయా వీధులకు చెందిన ప్రజలు రోడ్లు వేస్తున్నారని సంబరపడ్డారు. అయితే కంకర వేసి నాలుగు నెలలు గడుస్తున్నా రోడ్డు నిర్మాణం జరగలేదు. దీంతో రాకపోకలకు వారు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. కంకర రాళ్లలోనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యార్థులు, వృద్ధులు అవస్థలు వర్ణనాతీతం. రాత్రి సమయంలో వాహన చోదకులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. కంకర రాళ్లలో బైక్‌పై వెళ్లలేక మెయిన్ రోడ్డుపై పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు, కాంట్రాక్టర్ అలసత్వంతోనే రోడ్డు నిర్మాణంలో పనులు జరగడం లేదని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును పూర్తి చేయించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

వేడుకగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

నృత్యం చేస్తున్న చిన్నారి, పాల్గొన్న భక్తులు

మద్దికెర : స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో షష్ఠి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ముగింశారు. ఉదయం స్వామి, శ్రీవల్లి, దేవసేన ఉత్సవ మూర్తులను అలంకరించి కల్యాణం జరిపించారు. పండితుల వేదమంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా జరిగిన వేడుకను తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి స్వామి వారి ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి ఆలయ ఆవరణలో ప్రదక్షిణలు చేపట్టారు. కార్యక్రమంలో పత్తికొండ ఎమ్మెల్యే కేయి శ్యాంబాబు, ఎమ్మెల్సీ మధుసూదన్, ఎంపీపీ అనిత, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు పాల్గొన్నారు. రాత్రి తెనాలి, రాయలసీమ కళాకారులు నాటకం ప్రదర్శించారు.

ఘనంగా యూత్ క్యాండిల్ సర్వీస్



కోల్స్ చర్చిలో దైవ సందేశం ఇస్తున్న డాక్టర్ సందీప్ శాంసన్



నృత్యం చేస్తున్న చిన్నారులు

కర్నూలు (టౌన్): స్థానిక కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చిలో ఆదివారం రాత్రి సి.సి.వై.ఎఫ్ ఆధ్వర్యంలో యూత్ క్యాండిల్ సర్వీస్ ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో క్రైస్తవ యువతీ, యువకులు పాల్గొని క్రీస్తును స్తుతిస్తూ భక్తి గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ సందీప్ శాంసన్ దైవ సందేశం ఇచ్చారు. నేటి సమాజంలో యువతీ, యువకులు ఆధ్యాత్మిక నడవడిక పెంపొందించుకోవాలన్నారు. ఎస్టీబీసీ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ డాక్టర్ మనోరమ ఆల్బర్ట్, కోల్స్ చర్చి అధ్యక్షుడు ఎ.డి.ఎ.లింకన్, సి.సి.వై.ఎఫ్ డైరెక్టర్ ఆర్.బి.ఎలిజబెత్ భాస్కర్, అసిస్టెంట్ డైరెక్టర్ రోహిత్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

యేసుక్రీస్తు లోకానికి వెలుగు

కర్నూలు న్యూసిటీ: క్రీస్తు ఈ లోకానికి వెలుగుగా వచ్చాడని పాస్టర్ వరప్రసాద్ రావు అన్నారు. నగరంలో ఎస్‌పీజీ క్రైస్టు చర్చిలో ఆదివారం సండే స్కూల్, యూత్ క్యాండిల్ లైట్ సర్వీస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజలు క్రీస్తు బోధనలను జీవితాల్లో అలవర్చుకుంటే శాంతి కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో చిన్నారుల నృత్యాలు, నాటికలు కనువిందు చేశాయి. క్రిస్మస్ తాత పిల్లలకు బహుమతులు, చాక్లెట్లు పంచారు. పాస్టర్లు రవికుమార్, కరుణాకర్‌లు, పెర్సీ ఇమ్మాన్యుయేల్ తదితరులు పాల్గొన్నారు.